సాక్షి నిజామాబాద్

గురువారం । 22 । ఫిబ్రవరి । 2024



పోలీసు వృత్తి ఎంతో గొప్పది

పోలీసు వృత్తి ఎంతో గొప్పదని, ప్రజలకు ఏ ఆపద వచ్చినా అండగా ఉండేది పోలీసు లేనని సీపీ కల్మేశ్వర్ పేర్కొన్నారు.

- 8లో ▸



మహిళలకు వడ్డీలేని రుణాలు

మహిళా సంఘాల్లోని సభ్యులకు వడ్డీలేని రుణాలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 36.2 /20.3

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. మధ్యాహ్నం క్రమంగా ఎండ తీవ్రత పెరిగే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత తగ్గుతుంది.

న్యూస్‌రీల్

కొత్త రకం వంగడాలను సాగు చేయాలి



ధర్పల్లి: రైతులు కొత్తరకం విత్తనాలను సాగుచేసి అధిక లాభాలను పొందాలని ఎన్‌సీడీసీ రీజినల్ డైరెక్టర్ వంశీకృష్ణ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎన్‌సీడీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫార్మర్ ప్రొడ్యూసర్ కో–ఆప్షన్ సొసైటీ లిమిటెడ్(ఎఫ్‌పీవో)ను సందర్శించారు. అనంతరం రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అందించే ఈక్విటీ గ్రాంట్‌ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ సీఏ గౌస్, పాటి ల్ ఎఫ్‌పీవో చైర్మన్ మహిపాల్ యాదవ్, సీ వో సుజాత, డైరెక్టర్లు కోతి శేఖర్ రెడ్డి, మోహన్‌రెడ్డి, లోకేశ్, వెంకట్, శ్రీకాంత్, నరేశ్ పాల్గొన్నారు.

మోసపోయిన రైతులకు న్యాయం చేస్తాం



నిజామాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని కోటగల్లి సొసైటీలో 2018–19లో జరిగిన అక్రమాల్లో నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తామని చైర్మన్ శేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం సహకార సంఘం పరిధిలోని డైరెక్టర్లతో సమావేశం నిర్వహించారు. మార్చి 6న రైతులతో కలిసి, కో–ఆపరేటివ్ అధికారి శ్రీనివాసరావుతో పాటు మరి కొందరు జిల్లా సహకార అధికారుతో మహాసభను నిర్వహించి రైతుకు న్యాయం చేయాలని తీర్మానం చేశారు. 2018లో సొసైటీలో దొంగ రశీదులతో క్యాషియర్ భాస్కర్ రూ. 32లక్షలు, సీఈవో రూ. 50లక్షలు రైతులను మోసం చేశారన్నారు. మార్చి 6న నిర్వహించే సమావేశానికి సంఘం పరిధిలోని రైతులు, మోసపోయిన వారు హాజరై తమ వివరాలను డీసీవోకు, సహకార సంఘ పాలకవర్గానికి అందించాలన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం సీఈవో విష్ణు పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి



నిజామాబాద్ సిటీ: సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్న తికి, సంక్షేమానికి ఎస్‌బీఐ తమవంతు కృషి చేస్తుందని బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్ సూర్యకాంత దాస్ అన్నారు. బుధవారం నగరంలోని ప్రగతిభవన్ మొదటి అంతస్తులో నిర్వహించిన ఎస్‌బీఐ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యాలయ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. అట్టడుగు వర్గాల ఆర్థికాభివృద్ధికి తోడ్పడతామన్నారు. అనంతరం మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. పలురంగాల్లో ప్రతిభ సాధించిన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో బ్యాంక్ రీజినల్ మేనేజర్లు శ్రీకాంత్, అనుపమ ఆదర్శ్, శ్రీనివాస్, సంజీవ్ కుమార్ సహూ, దీనానాద్ ఝా, ఎస్‌బీఐ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు సూర్యం ధారావత్, ప్రధాన కార్యదర్శి భార్గవ కుమార్, జిల్లా అధ్యక్షుడు రవి, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రజ్యోత్ కుమార్ పాల్గొన్నారు.

బల్దియా బడ్జెట్

రూ. 274.89 కోట్లు



ఆర్థిక సంవత్సరం 2024-25

అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో అధికార మార్పిడి జరగడంతో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో బీఆర్ఎస్‌కు చెందిన కార్పొరేటర్లు ఒక్కొక్కరుగా పార్టీ ఫిరాయిస్తున్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్‌లోకి కొందరు, మరికొందరు సొంత పార్టీ బీజేపీలో చేరిపోయారు. దీంతో మొన్నటి వరకు బలంగా ఉన్న బీఆర్ఎస్ కాస్త బలహీన పడింది. నేడు జరుగనున్న బడ్జెట్ సమావేశం నేపథ్యంలో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

- మున్సిపల్ కార్పొరేషన్ బడ్జెట్ ఖరారు
- ఖర్చు రూ. 89 కోట్ల 97 లక్షల 50వేలు
- మిగులు బడ్జెట్ రూ. 30 కోట్లు
- నేడు ప్రత్యేక సమావేశం
- హాజరు కానున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

నిజామాబాద్‌నాగారం: 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బడ్జెట్ రూ. 274 కోట్ల 89 లక్షల 54 వేలుగా ఖరారు చేశారు. ఖర్చు రూ. 89 కోట్ల 97లక్షల 50వేలు చూపారు. కాగా మిగులు బడ్జెట్ రూ. 30 కోట్లు ఉంది. ఈ మేరకు గురువారం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక బడ్జెట్ సమావేశం జరుగనుంది. ఇదిలా ఉండగా ఇటీవల కాలంలో బీఆర్ఎస్‌కు చెందిన కార్పొరేటర్లు వరుసగా అధికార పార్టీ కాంగ్రెస్, బీజేపీ తీర్థం పుచ్చుకుంటున్నారు. ఈ ప్రభావం బడ్జెట్ సమావేశాల్లో జరిగే పరిణామాలపై బీఆర్ఎస్‌కు చెందిన మేయర్ ఉత్కంఠగానే ఉన్నట్లు మున్సిపల్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇప్పటి వరకు ప్రతి ఏడాది బడ్జెట్ సమావేశాలు బీఆర్ఎస్ అధికారంలో ఉండడంతో సాదాసీదాగా జరిగిన విషయం తెలిసిందే. అసెంబ్లీ



ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పాటు నిజామాబాద్ అర్బన్‌లో బీజేపీకి చెందిన ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గెలుపొందారు. కార్పొరేటర్లు పార్టీ మారడంతో ఇప్పటికే మేయర్ తీవ్ర ఒత్తిడిలో ఉన్నారు. బడ్జెట్ సమావేశానికి ఎమ్మెల్యే ధన్‌పాల్, కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్ హాజరు కానున్నారు. ఇప్పటికే వారు బడ్జెట్ కాపీలను తెప్పించుకుని పరిశీలన చేస్తున్నారు.

గతేడాది బడ్జెట్ ..

మున్సిపల్ కార్పొరేషన్ గత ఏడాది బడ్జెట్ రూ.272 కోట్ల 72 లక్షలు నిర్ణయించారు. ఇందులో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ నిధులు రూ. 171కోట్ల 27 లక్షలు, మిగిలిన మున్సిపల్ జనరల్ ఫండ్ రూ. 90కోట్ల 24లక్షలు ఉన్నాయి. ఇందులో ఈ ఏడాది జనవరి 31 వరకు రూ. 125 కోట్ల 59 లక్షలు వసూలు అయ్యాయి. రూ. 140 కోట్ల 27లక్షలు ఖర్చయ్యాయి.

రాబడి (రూ.కోట్లలో)	
మున్సిపల్ ద్వారా	90.09
ఆస్తి పన్ను	45
భవనాల అనుమతులు	23
కుళాయిల ఫీజు	6
షాపింగ్ కాంప్లెక్స్ అద్దె	2.50
యాడ్స్ రూపంలో	1.50
ట్రేడ్‌లైసెన్సు	1.50
తైబజార్	0.48
స్లాటర్ హౌజ్	1
చెత్త సేకరణ	1
మున్సిపల్ స్థలాలు	0.50
రెవెన్యూ గ్రాంటు	1
ఎల్ఆర్ఎస్	0.60
డిపాజిట్, లోన్‌లు	7.20
రాష్ట్ర, కేంద్రం నిధులు	177.59

ఖర్చు (రూ.కోట్లలో)	
జీతభత్యాలు	32.60
శానిటేషన్	8.77
విద్యుత్ బిల్లులు	10.88
గ్రీన్ బడ్జెట్	9.01
ఇంజనీరింగ్ ఖర్చు	7.18
జనరల్ అడ్మినిస్ట్రేషన్	3.85
టౌన్ ప్లానింగ్ ఖర్చు	0.22
1/3 బ్యాలెన్సు బడ్జెట్	5.86
వార్డు వారీగా పనులు	11.60

తెలంగాణను కాషాయమయం చేయాలి

- నా జోలికొస్తే కాంగ్రెస్ చరిత్ర బయటపెడతా
- ఐదేళ్లలో దేశంలో పసుపు సాగు విస్తీర్ణం పెరిగింది
- ఎంపీ అర్వింద్ ధర్మపురి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్ ధర్మపురి, పక్కన బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్

మోపాల్(నిజామాబాద్‌రూరల్): రానున్న ఎంపీ ఎన్నికల్లో తెలంగాణను కాషాయమయం చేయాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి పేర్కొన్నారు. కేంద్రంలో మూడోసారి మోదీ ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం నగరంలోని బోర్గాం(పి) మొటాటిరెడ్డి సంఘంలో కొమురంభీం క్లస్టర్ విజయ సంకల్ప బస్సు యాత్రకు సంబంధించి నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రాన్ని పదేళ్లలో ఆగం చేసిన కేసీఆర్ బాటలోనే సీఎం రేవంత్‌రెడ్డి నడుస్తున్నారని విమర్శించారు. ఏ ఒక్క గ్యారెంటీ అమలు చేసింది లేదన్నారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటే చేయండి.. కానీ చిల్లరమల్లర వ్యవహారాలు చేస్తే ఊరుకోనన్నారు. కాంగ్రెస్ అబద్ధాలు, మోసాలు చేసి అధికారంలోకి వచ్చిందని, చివరికి ఆ పార్టీని నమ్ముకున్న ముస్లిములను కూడా మోసం చేస్తుందన్నారు.

'జిల్లా పరిషత్'ను గెలుచుకుందాం

ప్రధాని మోదీ పాలనలో ఐదేళ్లలో సుమారు 65వేల హెక్టార్ల పసుపు సాగు విస్తీర్ణం పెరిగిందని ఎంపీ తెలిపారు. పసుపు ధర ఎందుకు పెరుగుతుందో మంత్రి తుమ్మలకు తెలియడం లేదని, ధర పెరగడానికి ప్రధాని తీసుకున్న నిర్ణయాలే కారణమని పేర్కొన్నారు. సనాతన ధర్మం, అభివృద్ధి, సంక్షేమ పథకాలు, దేశ రక్షణ, తదితర కార్యక్రమాలతో దేశ విలువ అంతర్జాతీయంగా పెంచుతున్నారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు సత్తా చాటాలని, బీజేపీకి కార్యకర్తలే బలమని పేర్కొన్నారు. ఈసారి జిల్లా పరిషత్‌పై కాషాయ జెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు.

బస్సుయాత్ర విజయవంతం చేయాలి

బీజేపీ విజయ సంకల్ప బస్సు యాత్ర జిల్లాలో ఈ నెల 27న సిరికొండ మండలం పెద్దవాల్గోట్ వద్ద ప్రవేశిస్తుందని, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి పిలుపునిచ్చారు. సమావేశంలో పార్లమెంట్ ప్రభారీ వెంకటరమణి, అసెంబ్లీ ప్రభారీ రాజు, పార్లమెంట్, అసెంబ్లీ కన్వీనర్లు గద్దె భూమన్న, పద్మారెడ్డి, కిసాన్, ఎస్టీ, యువ మోర్చాల జిల్లా అధ్యక్షుడు పొట్కూరి తిరుపతిరెడ్డి, కిషన్ నాయక్, రాజశేఖర్ రెడ్డి, నక్క రాజేశ్వర్, కేపీ రెడ్డి, సందీప్‌కుమార్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 5లక్షల కోట్లు మింగిన కేసీఆర్

రాష్ట్ర అప్పులు రూ.6 లక్షల కోట్లకు చేరగా, అందులో మాజీ సీఎం కేసీఆర్ రూ.5 లక్షల కోట్లు మింగేశాడని ఎంపీ అర్వింద్ ఆరోపించారు. అనవసరంగా తన జోలికి వస్తే కాంగ్రెస్ చరిత్ర మొత్తం బయటపెడతానని హెచ్చరించారు. మాజీ సీఎం వైఎస్ఆర్‌ను చంపిందెవరో తనకు తెలుసని అర్వింద్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్‌కు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు లేరన్నారు. ఇంకో పార్టీ నుంచి పోటీ చేసేందుకు అభ్యర్థులు ముందుకు రావడం లేదని బీఆర్ఎస్‌ను ఉద్దేశించి విమర్శించారు. కాళేశ్వరంపై ఎందుకు విచారణ చేపట్టడం లేదని ప్రశ్నించారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

డిచ్‌పల్లి: మండలంలోని ఖిల్లా రామాలయంలో సీతారాముల కల్యాణం బుధవారం కమనీయంగా జరిగింది. ఆలయ ధర్మకర్త గజవాడ రాందాస్ గు ప్తా కుటుంబీకులు సీతారాముల వారికి పట్టువస్త్రా లు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ప్రతియేటా మాఘశుద్ధ త్రయోదశి రోజు సీతారాముల కల్యాణోత్సవాన్ని ఆనవాయితీ నిర్వహిస్తున్నారు. స్వామి వారి కల్యాణోత్సవాన్ని ఆలయ ప్రధానార్చకుడు సుమిత్ శర్మ దేశ్‌పాండే ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని సందర్శించిన గంగోత్రి పీఠం రామానుజదాసన్ స్వామిజీ, కేదార్‌నాథ్‌కు చెందిన దీనబంధు స్వామీజీలు కల్యాణ వేడుకల్లో పాల్గొని పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా గు రువారం రాత్రి సీతారాములు వారికి గరుడ సేవ నిర్వహించనున్నారు. వేడుకల్లో ఆలయ కమిటీ చైర్మన్ జంగం శాంతయ్య, సర్పంచ్ గడ్డం రాధాకిష్టారెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ గజవాడ జైపాల్, ఆల య కమిటీ మాజీ చైర్మన్లు పి.మహేందర్‌రెడ్డి, దువ్వ నర్సయ్య, వీడీసీ సభ్యులు వారాల సాయిలు, తోట చిన్న సాయిలు, మాజీ సర్పంచ్ బూస సుదర్శన్, డైరెక్టర్లు గడ్డం నర్సారెడ్డి, సున్నం పోశెట్టి, సూర మాధురి, ఆసది జితేందర్, భక్తులు పాల్గొన్నారు.

2024 జెఈఈ మెయిన్స్ ఫలితాలలో KAKATIYA రికార్డ్



2024 JEE Mains జిల్లా I, 2, 3 స్థానాలే కాకుండా 90% పైనా సాధించిన 17 మంది కాకతీయ విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు అధికారి కె. రఘురాజ్ గారు, డైరెక్టర్ సి.హెచ్. రామోజీరావు, ప్రిన్సిపాల్స్ వి. రణధీష్, సందీప్ కులకర్ణి, ఇంచార్జి శ్యాం



MD. Minahaj
99.68%tile
Dist. 1st
JEE-Mains-2024

2024 IIT-Mains లో నాకు 99.68%tile రావటం KOS లో తీసుకున్న శిక్షణ యొక్క ఫలితమే. KOS లో గతంలో చదివి 13.2.2024 న విడుదలైన IIT-Mains 2024 ఫలితాల్లో మా తల్లిదండ్రులు గర్వించే విధంగా జాతీయ స్థాయిలో 99.68%tile సాధించాను. IIT/Medical లో రాణించాలంటే స్కూల్ స్థాయిలోనే పక్కాగా Real IIT/Medical Foundation లో శిక్షణ ఇచ్చే స్కూల్‌లో చేరాలి. నేను గతంలో KOS స్కూల్ నిజామాబాద్ లో చదివాను. ఈ 2024 మెయిన్స్ ఫలితాలలో 99.68%tile సాధించాను. KOS స్కూల్‌లో ప్రతి సబ్జెక్టుపై IIT/Medical Foundation కు ఇంటర్, ఎంసెట్ స్థాయి లెక్చరర్లతో మా డైరెక్టర్ Ch. రామోజీరావు IITIAN శిక్షణ ఇప్పించారు. గతంలో KOS లోనే ప్రతిరోజు ప్రతి సబ్జెక్టుపై శిక్షణ తీసుకోవడం వల్లనే ఇటీవల విడుదలైన IIT-Mains ఫలితాలలో 99.68%tile సాధించి మా తల్లిదండ్రుల గౌరవాన్ని నిలిపాను.



B. Shivapratham
99.22%tile
Dist. 3rd
JEE-Mains-2024

స్కూల్ స్థాయిలో **KOS Real IIT/Medical Foundation శిక్షణే నా ఈ జాతీయ స్థాయి 2024 IIT-Mains 99.22%tile కి పునాది.** KOS స్కూల్‌లో వేరే స్కూల్ మాదిరిగా మొక్కుబడిగా శిక్షణ ఉండదు. ఇక్కడ ప్రతి రోజు ప్రతి సబ్జెక్టుపై Real IIT/Medical Foundation పై ఇంటర్, ఎంసెట్ స్థాయి లెక్చరర్లతో శిక్షణ ఇస్తారు. గతంలో KOS స్కూల్‌లో శిక్షణ వల్లనే ఈ రోజు IIT-Mains 2024 99.22%tile జాతీయ స్థాయిలో సాధించాను. ఈ నూతన జాతీయ విద్యావిధానంలో IIT/Medical రాణించాలంటే ఇంటర్‌లో చదువుతానంటే కుదరదు. స్కూల్ స్థాయిలోనే తల్లిదండ్రులు జాగ్రత్త పడాలి. Real IIT/Medical Foundation పై ప్రతి సబ్జెక్టు ప్రతిరోజు ఇంటర్ & ఎంసెట్ స్థాయి లెక్చరర్లతో శిక్షణ ఇప్పిస్తారు. ఆ స్కూల్‌లోనే చదవాలి. KOS స్కూల్ స్థాయిలో మా డైరెక్టర్ Ch. తేజస్విని M.Tech. (Ph.D.) CSE గారి ప్రణాళికలు, ప్రోత్సాహం వల్లనే నేను ఈ రోజు Dist. 3వ ర్యాంకు సాధించాను. నా తల్లిదండ్రుల కలలను, ఆశయాలను నెరవేర్చాను.



Ch. Ramoji Rao
IITIAN
Director

KOS లో మెరుగైన విద్యా ప్రమాణాలతో బోధన సాగిస్తున్నాం. తద్వారానే ఇంటర్ చదువుతున్న మా విద్యార్థులు ఇంటర్‌తో పాటు తొలి ప్రయత్నంలోనే 2024 జెయియి మేయిన్స్‌లో గత రెండు సంవత్సరాల నుండి జిల్లాలో మొదటి మూడు ర్యాంకులు కైవసం చేసుకున్నాం. ఈ సారి కూడా మొదటి మూడు ర్యాంకులతో పాటు 50 మంది ఐఐటీ అడ్వాన్సుకు అర్హత సాధించారు.

అర్ధరాత్రి లాఠీ పట్టిన కమిషనర్



వాహనాలను ఆపి వాహనదారులను ప్రశ్నిస్తున్న పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్

- వాహనాల తనిఖీ
- రెండు హోటళ్లకు నోటీసులు

ఖలీల్‌వాడి: పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ అర్ధరాత్రి లాఠీ పట్టారు. నగరంలో మంగళవారం రాత్రి వాహనాలను తనిఖీ చేయడంతో పాటు డ్రంకన్ డ్రైవ్ టెస్టులు చేశారు. అర్ధరాత్రి పూట భారీ శబ్దం చేస్తూ ఓ వాహనం క్యాంపు కార్యాలయం ముందు నుంచి వెళ్లడంతో వెంటనే హోంగార్డు సహాయంతో బైకుపై వెళ్లి పట్టుకున్నారు. అనంతరం రెండు గంటల పాటు రోడ్లపై తిరుగుతున్న వాహనాలను తనిఖీ చేశారు. విషయం తెలుసుకున్న ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్ బాబు, పెట్రోలింగ్ పోలీసులు సీపీ వద్దకు చేరుకున్నారు. సరైన ధ్రువపత్రాలు, నంబర్ ప్లేట్లు లేని వాహనాలను ఒకటో టౌన్‌కు తరలించారు. అంతేకాకుండా రైల్వే స్టేషన్ వద్ద అర్ధరాత్రి వరకు తెరిచి ఉన్న హోటళ్లకు నోటీసులిచ్చారు. మళ్లీ రాత్రివేళ తెరిస్తే కేసులు నమోదు చేస్తామని సీపీ నిర్వాహకులను హెచ్చరించారు. జిల్లాలో శాంతిభద్రతలపై సీపీ సీరియస్‌గా దృష్టి సారించిన విషయం తెలిసిందే. పోలీసులపై వచ్చిన ఫిర్యాదులు, ఆరోపణలపై విచారణ చేపట్టి మెమోలు, సస్పెండ్ చేయడం విదితమే. అలాగే వీడీసీలపై చర్యలు తీసుకున్నారు. గల్ఫ్ ఏజెంట్ల మోసాల కట్టడికి చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. మంగళవారం అర్ధరాత్రి తనిఖీలు చేయడంతో రోడ్లపై విచ్చలవిడిగా తిరిగే అల్లరిమూకలకు పరోక్ష హెచ్చరికలు జారీ చేశారనే చర్చ జరుగుతోంది.

69.71 లక్షల పనిదినాలు

- 'ఉపాధి హామీ' 2024-25 ఆర్థిక సంవత్సరానికి అంచనా
- రాష్ట్ర శాఖకు వెళ్లిన ప్రతిపాదనలు
- పనుల అనుమతి కోసం వేచిచూస్తున్న అధికారులు



డొంకేశ్వర్(ఆర్మూర్): ఉపాధిహామీ పథకంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి అవసరమయ్యే పనిదినాలను గుర్తించారు. గ్రామాలు, మండలాల వారీగా వచ్చిన లెక్కలను క్రోడీకరించిన అధికారులు జిల్లాకు 69.71లక్షల పనిదినాలు అవసరమని అంచనా వేశారు. ఈ ప్రతిపాదనలను కలెక్టర్ అనుమతితో రాష్ట్ర శాఖకు ఇటీవల పంపించారు. పనుల అనుమతి కోసం వేచిచూస్తున్నారు. అత్యధికంగా నందిపేట్ మండలానికి 5.72లక్షలు, అత్యల్పంగా మోస్రాకు 55,902 పనిదినాలను ప్రతిపాదించారు. అయితే, ప్రతి ఏడాది జనవరి, ఫిబ్రవరిలలో గ్రామాల వారీగా సభలు నిర్వహించి పనులను గుర్తిస్తూ మండల కార్యాలయాల ద్వారా జిల్లాశాఖకు పంపుతున్నారు. కానీ, జిల్లా నుంచి వెళ్లిన ప్రతిపాదనలకు రాష్ట్రశాఖ పనిదినాలను తగ్గించి ఇస్తోంది. తద్వారా గ్రామాలు, మండలాలకు పనిదినాల సంఖ్య తగ్గుతోంది. దీనికి గతేడాది పంపిన పనుల ప్రతిపాదనలే ఉదాహరణగా చెప్పవచ్చు. 70 లక్షల పనిదినాలు అవసరమని కోరితే 40లక్షలకే అనుమతి వచ్చింది. ప్రస్తుతం పంపిన ప్రతిపాదనల్లో కూడా పనిదినాలకు కోత విధించే అవకాశం ఉంది. అనుమతి ఆధారంగానే బడ్జెట్ ఖరారు కానుంది.

ప్రస్తుత ఏడాదికి పెరిగిన పనిదినాలు

ప్రస్తుతం కొనసాగుతున్న 2023–24 ఆర్థిక సంవత్సరానికి తొలుత 40 లక్షల పనిదినాలు కల్పించాలని ప్రభుత్వం జిల్లాకు లక్ష్యాన్ని నిర్దేశించింది. అయితే, మొన్నటి వరకు ఇంతే ఉన్న లక్ష్యాన్ని మరో 8.97లక్షలు పెంచి మొత్తం లక్ష్యాన్ని 48.97 లక్షలకు చేర్చింది. ప్రస్తుతం జిల్లాలో 45.08 లక్షల పనిదినాలను (92.06 శాతం) పూర్తయ్యాయి. మిగిలిన లక్ష్యాన్ని మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాల్సి ఉంది. వేసవిలో చెరువుల పూడికతీత పనులు జోరుగా జరగనున్న నేపథ్యంలో ఈ ఏడాది లక్ష్యాన్ని దాటి కూలీలకు పనులు కల్పించే అవకాశం ఉంది. ఇప్పటి వరకు 1.51లక్షల మంది కూలీలు పనులకు వచ్చి రూ. 74కోట్ల ఉపాధిని పొందారు. వంద రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాల సంఖ్య 1,418కి చేరింది. ఇటు పనులకు వస్తున్న కూలీల సంఖ్య కూడా పెరుగుతోంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా రోజుకు 15వేలకు పైగా కూలీలకు పనులకు హాజరవుతున్నారు.

జాబ్ కార్డున్న ప్రతిఒక్కరూ పనికి రావాలి



రానున్న ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు అవసరమైన పనిదినాల అంచనా ప్రతిపాదనలను రాష్ట్ర శాఖకు పంపించాం. ఎన్ని పనిదినాలకు అనుమతి వస్తుందో చూడాలి. అయితే, ఈ ఏడాదికి నిర్దేశించిన లక్ష్యంలో 8.97లక్షల పనిదినాలను ప్రభుత్వం పెంచింది. మార్చి నాటికి లక్ష్యానికి మించి పనులు కల్పిస్తాం. జాబ్ కార్డున్న ప్రతిఒక్కరూ ఉపాధిహామీ పనులకు రావాలి.

– సాయాగౌడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

హాల్ టికెట్స్ విడుదల

డిచ్‌పల్లి: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభా (సీవోఈ) కళాశాలల మొదటి ప్రవేశ పరీక్ష క్వాలిఫై అయిన అభ్యర్థుల సెకెండ్ లెవల్‌కు సంబంధించిన హాల్ టికెట్స్ విడుదలైనట్లు సంస్థ జిల్లా కోఆర్డినేటర్ సంగీత బుధవారం తెలిపారు. హాల్ టికెట్స్‌ను www. tswreis. ac. in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఈ నెల 25న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందన్నారు.

క్లుప్తంగా

రైతులను మోసం చేసింది బీజేపీయే..

- రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి

ఖలీల్‌వాడి: రైతులను నమ్మించి మోసం చేస్తోంది బీజేపీయే అని రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మంత్రులను, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని విమర్శించే హక్కు ఎంపీ అర్వింద్‌కు లేదన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో పసుపునకు రూ.15 వేల మద్దతు ధర ఇప్పిస్తానని, పసుపు బోర్డు 5 రోజుల్లోనే ఏర్పాటు చేయిస్తానని, షుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తానని రైతులను నమ్మించి మోసపూరితంగా గెలవడం అసమర్థుడి లక్షణాలన్నారు. కాంగ్రెస్ ప్రజలు, రైతుల పక్షాన ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. ప్రజలు బీజేపీకి గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయని పేర్కొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



నిజామాబాద్‌నాగారం: బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో ఈ నెల 21 నుంచి 25 వరకు నిర్వహిస్తున్న జాతీయస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. అనంతరం పోటీలకు ఎంపికైన కల్యాణ్‌రాజ్, అరవింద్, మహేశ్, ఇందు, శ్రావిక, సాత్విక, సోనీలను జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్ అభినందించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



ఆర్మూర్ టౌన్: వాహనదారులు మోటరు వెహికల్ చట్టాన్ని ఉల్లంఘించి ప్రవర్తిస్తే చర్యలు తప్పవని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో రవికుమార్ అన్నారు. ఆర్మూరు పీఎస్ పరిధిలో నంబర్ ప్లేట్ లేని వాహనాలను పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

మహిళలకు వడ్డీలేని రుణాలు..

- గత ప్రభుత్వం నుంచి అమలవుతున్నా వచ్చింది రెండు సార్లే..
- వడ్డీలేని రుణాలను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం



భీమ్‌గల్‌లో నిర్వహించిన సమావేశానికి హాజరైన మహిళా సంఘాల సభ్యులు (ఫైల్)

మోర్తాడ్: మహిళా సంఘాల్లోని సభ్యులకు వడ్డీ లేని రుణాలను అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. వంద శాతం వడ్డీ రాయితీ రుణాల పథకాన్ని గత ప్రభుత్వం అమలు చేసినా వడ్డీని మహిళలకు చెల్లించడంలో విఫలమైంది. ఉమ్మడి రాష్ట్రంలో మహిళా సంఘాల సభ్యులకు పావలా వడ్డీకి బ్యాంకు లింకేజీ రుణాలను అందించేవారు. బ్యాంకులు నిర్ధేశించిన లెక్క ప్రకారం మహిళలు వడ్డీ, అసలు చెల్లిస్తే రాష్ట్ర ప్రభుత్వం 75 శాతం వడ్డీని రీ ఎంబర్స్‌మెంట్ రూపంలో తిరిగి ఇచ్చేది. రాష్ట్ర ఆవిర్భావం తరువాత వడ్డీలేని రుణాలు అందిస్తామని ప్రకటించింది. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో కేవలం రెండుసార్లు మాత్రమే వడ్డీ లేని రుణాలు ఇచ్చారు. వడ్డీ బకాయిలు పేరుకుపోయినా మహిళలకు నామమాత్రంగానే రాయితీ సొమ్ము చేతికి అందింది. 2023 సాధారణ ఎన్నికలకు ముందు రూ.200ల కోట్ల వడ్డీ బకాయిలకు రూ.72 కోట్లు మాత్రమే విడుదల చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది నుంచి జీరో వడ్డీ రుణాలను పక్కాగా అందించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క ఆదివారం నిర్వహించిన సభలో వడ్డీలేని రుణాలను మహిళా సంఘాల సభ్యులకు అందించనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం బకాయి పడిన వడ్డీ రాయితీ సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందా లేదా అనే సందేహం వ్యక్తమవుతోంది. జిల్లాలో 24,017 సంఘాలు ఉండగా ఇందులో రుణాలు అందుకోవడానికి అర్హత ఉన్న సంఘాలు 18,905 ఉన్నాయి. వీటికి 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.1,032.74 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్ధేశించారు. ఇప్పటి వరకు రూ.986.45 కోట్ల రుణాలను పంపిణీ చేశారు. రుణాల పంపిణీ లక్ష్యానికి చేరుకునే దశలో ఉండటం గమనార్హం. ఈ రుణాలకు వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి వడ్డీ రాయితీ వంద శాతం వర్తించనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జీరో వడ్డీ రుణాల పంపిణీతో మహిళా సంఘాలపై ఆర్థికభారం తగ్గుతుంది. ఏది ఏమైనా మహిళా సంఘాల సభ్యులకు జీరో వడ్డీ రుణాల అంశం మరోసారి తెరపైకి రావడంతో మహిళా సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

తగ్గుతున్న ఎస్సారెస్పీ నీటిమట్టం

- ఆయకట్టుకు కొనసాగుతున్న నీటి విడుదల



ఎస్సారెస్పీ నీటి మట్టం

బాల్కొండ: ఎస్సారెస్పీ నీటి నిల్వ 35 టీఎంసీలకు చేరుకుంది. ప్రాజెక్ట్ నుంచి యాసంగి సీజన్ ఆయకట్టు కోసం కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండటంతో నీటి మట్టం తగ్గుతోంది. ప్రస్తుత యాసంగి సీజన్ ప్రారంభం నాటికి ప్రాజెక్ట్‌లో 78 టీఎంసీల నీటి నిల్వ ఉంది. యాసంగి సీజన్‌లో కాలువల ద్వారా నీటి విడుదలను డిసెంబర్ 18 నుంచి ప్రారంభించారు. రెండు నెలల వ్యవధిలో 43 టీఎంసీల నీటి వినియోగం జరిగింది. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 35 టీఎంసీల నీరు ఉండగా అందులో 5 టీఎంసీలు తాగు నీటి అవసరాలకు, మరో ఐదు టీఎంసీలు డెడ్ స్టోరేజీ, ఆవిరి రూపంలో పోయేది 5 టీఎంసీలు పోను 20 టీఎంసీల నీరు మాత్రమే వినియోగానికి ఉంది.

ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 3500, లక్ష్మికాలువ ద్వారా 250, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 347, గుత్ప లిఫ్ట్ ద్వారా 270, సరస్వతి కాలువ ద్వారా 600, ఆవిరి రూపంలో 468 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి 1072.9(35 టీఎంసీలు)ల నీటి నిల్వ ఉంది. గతేడాది ఇదే రోజున ప్రాజెక్ట్‌లో 1078.9(49.44 టీఎంసీలు) నీటి నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

గ్రామంపై ఆర్మీ జవాన్ మమకారం

- పర్వతంపై ప్లకార్డుతో గ్రామం పేరు ప్రదర్శన



షాదుల్

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఆర్మీలో జవాన్‌గా పనిచేస్తున్న కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం అన్నాసాగర్ గ్రామానికి చెందిన మహ్మద్ షాదుల్ ఎత్తైన మంచు పర్వతంపై తన స్వగ్రామం పేరును ప్రదర్శించి మమకారం చాటుకున్నారు. షాదుల్ రెండ్రోజులుగా జమ్మూకశ్మీర్‌లోని లదాఖ్‌లో గల 18 వేల అడుగుల ఎత్తులో ఉన్న పర్వతంపై మైనస్ 38 డిగ్రీల టెంపరేచర్‌లో ఉద్యోగాన్ని నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా స్వగ్రామం అన్నాసాగర్ పేరుతో ఉన్న ప్లకార్డును ప్రదర్శించాడు. గ్రామస్తులు షాదుల్‌ను అభినందించారు.

పోలీసు వృత్తి ఎంతో గొప్పది

- పోలీస్ కానిస్టేబుళ్ల శిక్షణను ప్రారంభించిన సీపీ కల్మేశ్వర్
- జాన్కంపేట్ శిక్షణ కేంద్రంలో 195 మందికి శిక్షణ



మాట్లాడుతున్న సీపీ కల్మేశ్వర్



మాట్లాడుతున్న కామారెడ్డి ఎస్పీ సింధు శర్మ

ఖలీల్‌వాడి: పోలీసు వృత్తి ఎంతో గొప్పదని, ప్రజలకు ఎలాంటి ఆపద వచ్చినా అండగా ఉండేది పోలీసులే అని కమిషనర్ ఆఫ్ పోలీస్ కల్మేశ్వర్ అన్నారు. ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ శివారులో ఉన్న పోలీస్ శిక్షణ కేంద్రంలో నూతనంగా ఎంపికైన స్టయిఫండరీ క్యాడెట్ ట్రైనీ కానిస్టేబుళ్ల తొమ్మిది నెలల శిక్షణను సీపీ బుధవారం ప్రారంభించారు. ఈ శిక్షణలో కరీంనగర్, జగిత్యాల్, ములుగు జిల్లాల సివిల్ విభాగానికి చెందిన 195 మంది అభ్యర్థులకు శిక్షణ ఉంటుంది. ముందుగా సీపీ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. శిక్షణలో క్రమశిక్షణ ఎంతో అవసరమని అన్నారు. ఉత్తమ విధులతో మంచి గుర్తింపు సాధ్యమవుతుందని అన్నారు. ప్రజలతో సత్సంబంధాలు ఏర్పాటు చేసుకోవాలని, శిక్షణ కాలంలో ప్రతి ఒక్కరూ మానసికంగా, శారీరకంగా శిక్షణ పొంది ప్రతిభా అవార్డులు పొందాలన్నారు. శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్, డీసీపీ జయ్‌రాం మాట్లాడుతూ.. సామాన్య పౌరులుగా ఉన్న వారు ఇప్పుడు పోలీస్ కుటుంబంలో సభ్యులుగా మారారని, శిక్షణ పొందే వారిలో వేష, భాషల్లో మార్పులురావాలన్నారు. శిక్షణలో ఇండోర్, అవుట్ డోర్ తరగతులు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, ఏసీపీ శ్రావణకుమార్, ఏసీపీ రాజావెంకట్ రెడ్డి, బస్వారెడ్డి, పి.శ్రీనివాస్, ఎ. రవీందర్ రెడ్డి, నారాయణ, పోలీస్ యూనిట్ మెడికల్ ఆఫీసర్ సరళ, ఆర్‌సీఐ కె.శ్రీనివాస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఏడో బెటాలియన్‌లో..

డిచ్‌పల్లి: సమాజంలో పోలీస్ అనేది బాధ్యతాయుతమైన వృత్తి అని కామారెడ్డి ఎస్పీ సింధుశర్మ పేర్కొన్నారు. మండలంలోని రాష్ట్ర ప్రత్యేక పోలీస్ ఏడో బెటాలియన్, డిచ్‌పల్లి కమాండెంట్ రాంప్రకాశ్ ఆధ్వర్యంలో ఇటీవల ఎంపికైన ట్రైనీ ఏఆర్ కానిస్టేబుళ్ల శిక్షణను సీపీ బుధవారం ప్రారంభించారు. 9 నెలల శిక్షణలో నేర్చుకునే మెళకువలు ఉద్యోగంలో ఎంతో ఉపయోగపడతాయన్నారు. మారుతున్న కాలంతో పాటు మనం మారాలని, నిపుణులైన ట్రైనర్స్ వివిధ అంశాల్లో ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం కమాండెంట్ రాంప్రకాశ్ మాట్లాడుతూ.. 2002లో ఏడో బెటాలియన్‌ను ట్రైనింగ్ సెంటర్‌గా గుర్తించారని, ఇప్పటి వరకు బెటాలియన్‌లో 12 బ్యాచ్‌లు శిక్షణ పూర్తి చేసుకుని రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 13వ బ్యాచ్‌లో సైబరాబాద్ ఏఆర్ ట్రైనీ కానిస్టేబుళ్లు 278 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్స్ ఆంజనేయరెడ్డి, భాస్కర్ రావు, ఏవో హంసరాణి, యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనుపమ, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు, ట్రైనీ కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణకు వచ్చిన ట్రైనీ కానిస్టేబుళ్లు

సేవాలాల్ ఆశయాలను పాటించాలి



విద్యార్థినులతో కలిసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే

బోధన్‌టౌన్: బంజారాల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశయాలను యువత పాటించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలకు ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ప్రత్యేక పూజలు చేసి బోగ్ బండార్ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే బంజారా విద్యార్థులతో కలిసి నృత్యం చేశారు. వేడుకల్లో ఆలిండియా బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రునాయక్, ఆర్డీవో రాజాగౌడ్, కమిషనర్ వెంకట నారాయణ, ఎంపీడీవో రవీందర్, తహసీల్దార్ గంగాధర్, డీసీసీ డెలికెట్ గంగాశంకర్, పట్టణ అధ్యక్షుడు పాషామొయినొద్దీన్, బంజారా సేవా సంఘం నాయకులు దూప్‌సింగ్, సంజీవ్, రవిదాస్, గణేశ్, ప్రవీణ్, విఠల్, లక్ష్మణ్, రమేశ్, సాయికృష్ణ పాల్గొన్నారు.

బస్ డ్రైవర్‌పై దాడి

- మూడుగంటల పాటు డ్రైవర్ల ధర్నా
- ఇబ్బందిపడిన ప్రయాణికులు



ధర్నా చేస్తున్న ఆర్టీసీ డ్రైవర్లు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ఆర్టీసీ ప్రాంగణంలో ప్రైవేట్ ఆర్టీసీ డ్రైవర్‌పై ముగ్గురు ప్రయాణికులు బుధవారం దాడి చేశారు. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఆర్మూర్ నుంచి మెట్‌పల్లికి వెళ్లేందుకు ప్లాట్‌ఫాంపై సిద్ధంగా ఉన్న బస్సు డ్రైవర్ కండక్టర్ కోసం హారన్ చేశాడు. దీంతో బస్సు ఎదుట ఉన్న ముగ్గురు ప్రయాణికులు డ్రైవర్ నర్సయ్యపై దాడి చేశారు. దీంతో డ్రైవర్లు బస్సులను నిలిపివేశారు. దీంతో మూడు గంటల పాటు ఆర్టీసీ ప్రాంగణంలోకి బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. డిపో మేనేజర్ డ్రైవర్లను, కండక్టర్‌లను పిలిపించి మాట్లాడి దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విధుల్లో చేరారు. బస్సులలో ప్రయాణికులను క్షేమంగా వారి గమ్యస్థానాలకు చేరుస్తున్న ఆర్టీసీ డ్రైవర్లపై దాడి సరైందని కాదని ప్రైవేట్ హైర్ బస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. అధికారులు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు



వర్ని: లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన, చేయించిన, చేసుకున్న వారికి జైలు శిక్ష తప్పదని జిల్లా ఐసీడీఎస్ వెల్ఫేర్ ఆఫీసర్ రసూల్ బీ అన్నారు. మండల కేంద్రంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంపై అంగన్‌వాడీ, ఐకేపీ, ఆశా కార్యకర్తలకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆడపిల్లలపై వివక్షత చూపరాదని ఈ చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ జానకమ్మ, సూపర్‌వైజర్ వనజ, జిల్లా మహిళా సాధికారిక కో–ఆర్డినేటర్ స్వప్న, పోషణ్ అభియాన్ కో–ఆర్డినేటర్ రాంబాబు, జమున పాల్గొన్నారు.

విద్యార్థులకు ఓపెన్ హౌజ్



బాల్కొండ: బాల్కొండ తెలంగాణ మైనార్టీ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులకు బుధవారం ఓపెన్ హౌజ్ నిర్వ హించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలను విద్యార్థులు సందర్శించారు. ఎస్సై గోపి విద్యార్థులకు పోలీస్ స్టేషన్‌లో విధులను గురించి వివరించారు.

క్రైం కార్నర్

బైక్ అదుపుతప్పి ఒకరి మృతి



భూమేశ్(ఫైల్)

బాల్కొండ: బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిన ఘటనలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై భాస్కరాచారి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రెంజర్లకు చెందిన భూమేశ్(35) మెండోరా మండలం బుస్సాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. ఇటీవల దుబాయి నుంచి వచ్చిన అతను మిత్రులను కలిసేందుకు మంగళవారం బుస్సాపూర్‌కు బయలుదేరాడు. రాత్రి తిరుగు ప్రయాణంలో గ్రామ శివారులోని పెద్దవాగు రోడ్డుపై బైక్ అదుపుతప్పి కింద పడిపోవడంతో తలకు తీవ్రగాయమైంది. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భాస్కాచారి పేర్కొన్నారు.

రైలు కిందపడి వృద్ధుడు..

నవీపేట: నవీపేట రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వృద్ధుడు రైలు కింద పడి మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మహమూద్ బుధవారం తెలిపారు. రైలు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి పడడంతో కాళ్లు, చేతులు విరిగి మృతి చెందాడని పేర్కొన్నారు. వృద్ధుడి వయస్సు సుమారు 60 ఏళ్ల వరకు ఉంటుందని అన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

వాహనం ఢీకొని విద్యార్థికి తీవ్రగాయాలు

డిచ్‌పల్లి: బీబీపూర్ తండాలోని జాతీయరహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని విద్యార్థి కల్యాణ్‌కు తీవ్ర గాయాలైనట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బీబీపూర్‌కు చెందిన కల్యాణ్ బుధవారం అర్ధరాత్రి రహదారికి అవతలి వైపు ఉన్న బీబీపూర్ తండాలో నిర్వహించే పెళ్లికి బయలుదేరాడు. ఈ క్రమంలో రహదారిని దాటుతుండగా డిచ్‌పల్లి నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం వేగంగా ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ కల్యాణ్‌ను స్థానికులు 108 అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

సాటాపూర్‌లో బాలుడి అదృశ్యం

రెంజల్: మండలంలోని సాటాపూర్‌లో రిషి అనే తొమ్మిదేళ్ల బాలుడు అదృశ్యమైనట్లు ఏఎస్సై బాబురావు తెలిపారు. శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన రిషి తిరిగి రాలేదు. పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. తండ్రి మద్యం సేవించి రిషిని బెదిరించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడని తెలిపారు. రిషి మేనత్త భూమవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

ఒకరికి రెండు రోజుల జైలు

భిక్కనూరు: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఒకరికి కామారెడ్డి న్యాయమూర్తి రెండు రోజుల జైలు, రూ. 200 వందల జరిమానా విధించినట్లు ఎస్సై సాయికుమార్ బుధవారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన సిద్దరాములు ఇటీవల డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడడంతో కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. విచారణలో రెండు రోజుల జైలు, జరిమానాను జడ్జి విధించినట్లు తెలిపారు.

ఆలయంలో హుండీ చోరీ

రుద్రూర్: మండలంలోని గైని గుట్ట శ్రీ స్వయం భూబసవేశ్వర ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు ఆలయం తాళాలు పగల గొట్టి గర్భగుడిలోకి ప్రవేశించారు. హుండి తాళం పగల గొట్టి అందులోని డబ్బులు తస్కరించారు. బుధవారం తెల్లవారు జామున పూజలు నిర్వహించడానికి వెళ్లిన పూజారి పరమేశ్వర్ మహరాజ్ చోరీ జరిగినట్లుగా గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఎస్సై మహేందర్ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఇలాంటి ఘటనలు జరుగకుండా ఆలయ పరిసర ప్రాంతాల్లో పెట్రోలింగ్ చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

సాటాపూర్‌లో కారు..

రెంజల్: మండలంలోని సాటాపూర్‌లో ఓ ఇంటి ఎదుట నిలిపి ఉంచిన కారు చోరీకి గురైనట్లు ఏఎస్సై బాబురావు బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన అబ్దుల్ రవూఫ్ తన కారును ఇంటి ఎదుట మంగళవారం రాత్రి పార్కింగ్ చేసి నిద్రించాడు. ఉదయం చూసే సరికి కారు కనిపించకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

సౌదీలో గాంధారి వాసి ఆత్మహత్య

గాంధారి: సౌదీలో గాంధారి వాసి ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన చాకలి పోశయ్య(52) బతుకుదెరువు నిమిత్తం గత 20 ఏళ్ల నుంచి సౌదీకి వెళ్తూ వస్తున్నాడు. గతేడాది స్వగ్రామానికి వచ్చిన పోశయ్య కుమారుని వివాహం చేశాడు. నాటి నుంచి కల్లుకు అలవాటుపడ్డాడు. ఇటీవల సౌదీకి వెళ్లిన పోశయ్య వింతగా ప్రవరిస్తున్నట్లు అక్కడి స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించారు. కల్లుకు అలవాటుపడ్డ పోశయ్య సౌదీలో లభించకపోవడంతో మతిస్థిమితం కోల్పోయాడని గ్రామస్తులు తెలిపారు. మంగళవారం రాత్రి తన గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు అక్కడి స్థానికులు సమాచారం అందించారని కుటుంబీకులు తెలిపారు. మృతదేహాన్ని స్వదేశానికి రప్పించేలా ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యే మదన్‌మోహన్ కృషి చేయాలని కుటుంబీకులు కోరుతున్నారు.

కుటుంబ కలహాలతో ఒకరు..

మాక్లూర్: కుటుంబ కలహాలతో ఒకరు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మాక్లూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై సుధీర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన తాహెర్ మోబీన్(48) ఇటుక బట్టీల వ్యాపారం చేస్తుంటాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 20న రాత్రి భార్యతో గొడవ జరగడంతో మనస్తాపానికి గురై మోబీన్ స్థానిక చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

మాక్లూర్: మండలంలోని మదన్‌పల్లి శివారులో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు టాస్క్ ఫోర్స్ సీఐ అజయ్‌బాబు తెలిపారు. ఈ దాడిలో ఎనిమిది మందిని పట్టుకొని అరెస్టు చేయగా వారి నుంచి రూ. 8,270 నగదు, 9 సెల్‌ఫోన్లు, 13 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మరో ఐదుగురు పరారీలో ఉన్నారని అన్నారు.

కారులో తరలిస్తున్న మద్యం పట్టివేత



ఖలీల్‌వాడి/ రెంజల్: కారులో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ స్వప్న బుధవారం తెలిపారు. రెంజల్ మండలం తాడ్‌బిలోలికి చెందిన మహిపాల్‌రెడ్డి 8 మద్యం బాటిళ్లను మహారాష్ట్రలోని ధర్మాబాద్ నుంచి అక్రమంగా తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.



సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

- మీ బంగారం తాకట్టులో ఉందా. వడ్డీ చెల్లించలేకపోతున్నారా. ఎటువంటి ఫైనాన్స్‌లో ఉన్నా బంగారాన్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకే కొనబడును. ఫోన్: 9389214214. [HA-787728]
- కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్‌ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు,✆9773917835. [T-1252668]
- ద్వారక ఎంటర్‌ప్రైస్: పేపర్‌ప్లేట్స్ & LED మిషన్స్ పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం. ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం ✆ 9310515624, 8800496710 [G-1438]

CHANGE OF NAME

- I, DHOLLANNAGARI BALAVVA (OLD NAME) MACHERLA, NZB. Hence changed my name as LOKA CHINA BALAVVA, W/o. LOKA PRATHAP (NEW NAME) [Z-795674]
- I, DHOLLANNAGARI PRATHAP (OLD NAME) MACHERLA, NZB. Hence changed my name as LOKA PRATHAP, S/o. GANGARAM (NEW NAME) [Z-795673]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/-రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

Finance Services

- సిరి అసోసియేట్స్ అన్ని రకాల రుణాలు, పర్సనల్ హౌసింగ్ మార్ట్‌గేజ్ ఓపెన్ ప్లాట్స్ పై కూడా సిబిల్ ప్రాబ్లం ఉన్న చేయించబడును. సంప్ర: సెల్: 9666142226. [W-788999]

REAL ESTATE

LEASE / RENT

- ఆర్మూర్ – కరీంనగర్ హైవేకి ఆనుకొని లక్కొర గ్రామం నందు 3 ఎకరాల భూమి కమర్షియల్ కొరకు లీజ్/రెంట్‌కి ఇవ్వబడును. Contact: 9705025490. [Z-795669]

WANTED

- హరేకృష్ణ హోమ్ కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 18k ఫోన్: 9640258899 / 9640468899. [H-793694]
- ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 9030675274. [M-1233797]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.